

జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దాం

- కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్డి



మాట్లాడుతున్న కర్నూలుజిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్డి

కర్నూలు లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 13న జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దామని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్డి పోలీసు అధికారులను కోరారు. స్థానిక న్యాయ సేవా సదన్ భవనంలో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లలో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో రాజీకి వీలున్న కాంపౌండబుల్ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులు, భూసేకరణ కేసులు కూడా పరిష్కరించుకోవాలని, ఇందుకుగానూ పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులు కృషిచేయాలని అన్నారు. సంబం ధిత అధికారులు జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనంత వరకు ఎక్కువ కేసులను పరిష్కరిం చేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించిన పోలీసు, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- ఇంటి పట్టాలకు భూమిని గుర్తించండి
- కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్ బాషా రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కి వచ్చే అర్జీలలో 80 నుంచి 85 శాతం వరకు రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే ఉంటాయన్నారు. ఇందులో ప్రధానంగా రీసర్వే సమస్యలతో పాటు సర్వేయర్లు ఫీల్డ్‌కు వెళ్లడం లేదని చెప్పకుండా సర్వే చేస్తున్నారనీ సర్వే చేసేందుకు డబ్బులు అడుగుతున్నారనీ సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కర్నూలు, సి.బెళగల్, గోనెగండ్ల, కోడుమూరు తహసీల్దార్ల కార్యాలయాలపై ప్రజల నుంచి వ్యతిరేక స్పందన వచ్చిందన్నారు. 22 ఏ కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ కింద ఇంటి పట్టాల కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఆయా గ్రామాల్లో భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్: ఈ ఏడాది స్పెషల్ సమ్మరి రివిజన్‌కు బదులుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఉంటుందని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. బదిలీలు జరిగిన నేపథ్యంలో అన్నీ చోట్ల బీఎల్వోలను నియమించుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఈఆర్వో, ఏఈఆర్వోలను ఆదేశించారు. అలాగే బీఎల్వోల నియామక వివరాలు ఈఆర్వో నెట్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.


గీత కులాలకు బార్లు

- నోటిఫికేషన్ విడుదల, 30న ఎంపిక

కర్నూలు అర్బన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ ప్రకారం గీత కులాల కేటాయించిన పదిశాతం కోటాలోని 3 బార్లకు నోటిఫికేషన్‌ను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సుధీర్ బాబు జారీ చేశారు. బుధవారం సాయంత్రం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఓ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో 23 బార్లకు ఈనెల18న నోటిఫికేషన్ జారీ చేయగా కలెక్టర్ రంజిత్‌భాషా చేతుల మీదుగా లాటరీ పద్ధతిన బార్లను కేటాయించామని తెలిపారు. ఈ ప్రక్రియలో కర్నూలు నగరంలోని రెండు బార్లలో ఈడిగ-1, గౌడ్-1 ఆదోనిపట్టణంలో ఈడిగ-1 చొప్పున బార్లను కేటాయించామని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు తహసీల్దార్ జారీ చేసిన సప్లిమెంటరీ కుల ధ్రువీకరణ పత్రాలను జత చేయాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.50వేలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు మొత్తాన్ని నెట్ బ్యాకింగ్ ద్వారా చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. ఆఫ్‌లైన్‌లో కూడా బ్యాంకులో రుసుం చెల్లించి, చలనా దరఖాస్తులను కర్నూలు ఎక్సైజ్ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం వరకు చేసుకోవచ్చని, ఈనెల 30న లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

ఊపందుకున్న ఉల్లి కొనుగోళ్లు

- అమ్మకానికి 2,816 క్వింటాళ్లు



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి ఉల్లిని వివిధ ప్రాంతాల నుంచి రైతులు తీసుకొస్తున్నారు. రెండు నెలలుగా ఉల్లి కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉల్లి పక్వానికి రావడంతో పాటు బుధవారం ఎండలు రావడంతో రైతులు కర్నూలు మార్కెట్ యార్డుకు 2,816 క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. క్వింటా గరిష్ఠంగా రూ.1,259, మధ్యస్థ ధర రూ.1,109, కనిష్ఠంగా రూ.535కు అమ్ముడుపోయింది.



ఆరుగురు చిన్నారులను పొట్టన పెట్టుకున్న నీటి గుంత ఇదే

అయ్యో..పాపం!



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

వివరాలు 7లో

- సరదాగా స్నానం చేసేందుకు వెళ్లి మృత్యుఒడిలోకి..
- ఆరుగురిని బలి తీసుకున్న ఎర్రగరుసు నీటి గుంత
- కన్నవాళ్లకు కడుపు కోత
- శోకసంద్రంగా మారిన చిగిలి
- సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి



స్నేహితుడు దుర్గాప్రసాద్



భీమేష్ (ఫైల్)



సాయికిరణ్ (ఫైల్)



కిన్నెర సాయి (ఫైల్)



మహబూబ్ బాషా (ఫైల్)



వినయ్ (ఫైల్)



శశికుమార్ (ఫైల్)

బాబు లే బాబు.. చిన్నా కళ్లు తెరవరా.. నాయనా లేచి రారా.. అంటూ కన్నవారి ఆక్రందనలు.. ప్రతిఒక్కరికి కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. పదేళ్లకే నూరేళ్ల నిండాయి ఆ చిన్నారులకు.. సరదా కోసం వెళ్లి మృత్యుఒడికి చేరి కన్నవారికి కడుపు కోత మిగిల్చారు ఆ ఆరుగురు.. వారంతా పదేళ్ల చిన్నారులు.. ఒకే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు.. మిత్రులంతా కలిసి ఆడుతూ పాడుతూ బుధవారం ఒడికి వెళ్లి వచ్చారు. పాఠశాల వదలగానే పుస్తకాల సంచులు ఇంట్లో పెట్టారు. గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న కొండల్లోని గరుసు గుంతల వద్దకు వెళ్లారు. అప్పటికే గుంతలన్నీ వర్షపు నీటితో నిండి పోయి ఉన్నాయి. సరదాగా స్నానం చేసేందుకు ఏడుగురు చిన్నారులు ఆగుంతల వద్దకు చేరుకున్నారు. ఒకరు మాత్రం గట్టుపైనే నిలబడ్డాడు. ఆరుగురు మిత్రులు కలిసి గుంతలోకి దిగారు. ఈత రాక నీటి మునిగి ఒక్కొక్కరుగా ఐదుగురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఒకరు మాత్ర కొనఊపిరి కొట్టుమిట్టాతుండగా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆరుగురు చిన్నారులు మృత్యుఒడి చేరి కన్నవారికి కడుపుకోతను మిగిల్చిన ఈఘటనను చూసిన ప్రతిఒక్కరూ అయ్యో పాపం ఎంత ఘోరం జరిగిపోయింది అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈఘటనతో చిగిలి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



కిన్నెరసాయి మృతదేహన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్



రోధిస్తున్న సాయికిరణ్ కుటుంబ సభ్యులు



మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఇదే

సిబ్బంది పనితీరును మెరుగుపర్చుకోవాలి

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలులో, అర్జీల పరిష్కారంలో మినిస్టీరియల్ సిబ్బంది పనితీరును మెరుగుపరుచుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం ఆయన తనచాంబర్‌లో మినిస్టీరియల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సదరం, ఆర్‌టీఐ, మెడికల్ రీయింబర్స్‌మెంటు, కోర్టు కేసులు, మెడికల్ రికార్డు సెక్షన్‌కు సంబంధించిన వాటిపై సమీక్ష చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఫైల్‌ను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ఐవీఆర్ఎస్‌లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల పనితీరుపై సమీక్ష చేశారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన దరఖాస్తులకు త్వరితగతిన పరిష్కారం చూపాలన్నారు. సమీక్షలో సీఎస్ఆర్ఎంవో డా.టీసీహెచ్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ ఏడీ మల్లేశ్వరమ్మ, ఏవో శ్రీనివాసులు, ఆఫీసు సూపరింటెండెంట్ లతీఫ్ బేగ్ పాల్గొన్నారు.

ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం

- చెంచుల జీవన ప్రమాణాల పెంపునకు కృషి
- ఏడాదిలోనే శ్రీశైలం ఐటీడీఏకు రూ.10కోట్ల నిధులు
- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ఆత్మకూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలలో రాష్ట్రం విధ్వంసకరంగా మారిందని రాష్ట్ర స్త్రీ, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ కాలనీలో రూ.25లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటుచేసిన నల్లమల నన్నారీ తయారీ కేంద్రాన్ని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డితో కలిసి ప్రారంభించారు. ముందుగా ఆమె నన్నారీ ప్లాంట్‌ను సందర్శించి పనితీరు గురించి ఇక్కడి చెంచులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వారి సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మంత్రి సంధ్యారాణి మా ట్లాడుతూ సీఎం చంద్రబాబు గిరిజన సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని గుర్తుచేశారు. ఇంతకాలం మూడు రోజుల పాటు కష్టపడితే కేవలం వంద నన్నారీ బాటిళ్లు తయారయ్యేవని, అదే నన్నారీ ప్లాంట్ ద్వారా ఒక్కరోజులోనే వెయ్యి బాటిళ్లను తయారీ చేసే వెసులుబాటు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీనిద్వారా సుమారు 1500 గిరిజన మహిళలు ఉపా ధి పొందే అవకాశం ఉందన్నారు. శ్రీశైలం కేంద్రంగా గిరిజన ఉత్పత్తుల కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేశామన్నారు. చెంచుల జీవన ప్రమాణాల మెరుగుకోసం శ్రీశైలం ఐటీడీఏకు ఏడాదిలోనే రూ.10కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. మిగతా 6లో...



నల్లమల నన్నారీ తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతిపై అవగాహన

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ ద్వారా తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకునే వ్యాపారులకు 22న అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జీ.జ నార్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు ప్రధాన తపాలా కార్యాలయంలో జరిగే అవగాహన కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన క్లస్టర్ల ప్రతినిధులు హాజరవతున్నారన్నారు. తమ ఉత్పత్తులు, వస్తువులను ఎగుమతి చేయాలనుకునే చిన్న వ్యాపారులు, ఉత్పత్తిదారులు, ఐఈసీ హోల్డర్లకు ఒక మంచి అవకాశమన్నారు. ఉత్పత్తులను విదేశాలకు ఎగుమంతి చేయాలనుకునే వారికి తపాలా శాఖ పూర్తి సహకారాలు అందిస్తుందన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి వ్యాపారవేత్తలు, చిన్నవ్యాపారులు, ఉత్పత్తిదారులు హాజరై వ్యాపారాన్ని విదేశాల్లో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అధికారి హెచ్.గరీబ్‌బాషా ఫోన్ నంబర్ 8979286405ను సంప్రందించాలన్నారు.

జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు హర్షద్ బాషా



హర్షద్‌బాషాను అభినందిస్తున్న నాయకులు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈ నెల 14 నుంచి 17 వరకు జరిగిన జూనియర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ టోర్నమెంటులో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరచిన ఎస్‌కే హర్షద్ బాషా 75వ జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ టోర్నమెంటుకు కర్నూలు నుంచి ఎంపికయ్యాడు. పంజాబ్‌లోని లూథియానాలో జరుగుతున్న టోర్నమెంటుకి కర్నూలు క్రీడాకారులు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని జిల్లా కార్యదర్శి భాను ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు గౌతమ్‌రెడ్డి, ఎన్‌వీఆర్ లాడ్జి అధినేత వెంకటరెడ్డి సెయింట్ జోసెఫ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న హర్షద్ బాషాకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ముస్తహీర్, ప్రతినిధులు సురేంద్రబాబు, వలి, మధు తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు



హుండీని లెక్కిస్తున్న శంకర్‌వాణి సేవా సమితి సభ్యులు

మంత్రాలయం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. గడిచిన 22 రోజులకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3,35,31,756 నగదు రూపంలో వచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు,వెంకటేష్ జోషి, మేనేజర్, ఈఈ సురేష్ కోణాపూర్ తెలిపారు. గురు రాజాంగణ భవనంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో బళ్లారికి చెందిన శంకర్‌వాణి సేవా సమితి 175 మంది సభ్యులు పాల్గొన్నారు. నగదుతో పాటు 1.440 కిలోల వెండి, 7.4 తులాల బంగారు, వివిధ దేశాలకు చెందిన కరెన్సీ వచ్చింది. ఈ లెక్కింపులో ఎస్‌బీఐ మేనేజరు రాజశేఖర్, శ్రీపతి ఆచార్, అనంత పురాణిక్, జేపీ స్వామి, ఆడిటర్ దత్తుస్వామి, కృష్ణమూర్తి, సుజ్ఞానేంద్ర, శ్రీపాద ఆచార్, నరసింహా దేశాయ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అందాలలో అహో మహోదయం..



సెలయేళ్ల సవ్వడులు

- ఊటీని తలపిస్తున్న నల్లమల
- కేజీ రోడ్డుపై కనువిందు చేస్తున్న ప్రకృతి సోయగం
- ఆహ్లాదాన్ని పంచుతున్న రోళ్లపెంట ఘాట్
- సెల్ఫీలతో సందడి చేస్తున్న పర్యాటకులు




ఆహ్లాదాన్ని పంచుతున్న నల్లమలలోని రోళ్లపెంట ఘాట్ అందాలు



పట్టపగలే వాహనానికి లైట్లు వేసుకుని కేజీరోడ్డుపై ప్రయాణం

'అందాలలో అహో మహోదయం.. భూలోకమే నవోదయం..' అంటూ సాగిన సినీ గేయం మాదిరిగానే నల్లమల అందాలు ప్రకృతి ప్రేమికులను కట్టి పడేస్తున్నాయి. ఊటీని తలపిం చేలా నల్లమల కొండలు కనువిందు చేస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో కొన్నిరోజులుగా నల్లమల అటవీ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వానలు తగ్గినప్పటికీ ఆకాశంలోని మేఘాలు సైతం నల్లమల కొండల అంచుల్ని తాకుతూ.. నిరంతరం మంచు కురిసినట్లు అనుభూతిని ఇస్తున్నాయి. ప్రత్యేకించి రోళ్లపెంట ఘాట్ వద్ద వున్న కొండ ప్రాంతాల్లో మంచు తరహాలో చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో నల్లమలలోని కొండలన్నీ మంచుతో కప్పబడినట్లు దర్శనమిస్తున్నాయి. ఊటీ మాదిరిగా రోళ్లపెంట ఘాట్ ఉండటంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి మీదుగా వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు అక్కడ వాహనాలను నిలుపుకొని నల్లమల అందాలను వీక్షిస్తున్నారు. అక్కడే కాసేపు సేదతీరి సెల్ఫీలతో సందడిగా చేస్తున్నారు. కేజీరోడ్డుకు ఇరువైపుల ఉండే పచ్చదనం ప్రకృతే ఆహ్వానం పలుకుతున్నట్లుగా అద్భుతంగా కనిపిస్తోంది.



ఊటీని తలపించేలా నల్లమల కొండలు

● ఆత్మకూరు, ఆంధ్రజ్యోతి

అన్నదాతకు ఆధార్ తరహా గుర్తింపు సంఖ్య

- వీటి ద్వారానే అన్ని పథకాలు అమలు



రైతుకు జారీ కానున్న విశిష్ట సంఖ్య పత్రం

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆధార్ కార్డు ఇచ్చినట్లుగానే అన్నదాతలకు ప్రత్యేకంగా ఒక విశిష్ట గుర్తింపు పత్రం ఇచ్చేందుకు సమాయత్తమైంది. గత సంవత్సరం ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమం ప్రస్తుతం ఈ ఏడాది ఫిబ్రవరిలో అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖలు ప్రారంభించాయి. ప్రస్తుతం ఆధార్‌తో సేవలను తరుచు ప్రతి పౌరుడు ఎలా అందుకుంటున్నారో.. అదే రీతిలో రైతు విశిష్ట సంఖ్య గుర్తింపు పత్రంతో ప్రభుత్వం అమలు చేసే పథకాలను పొందగలరనీ వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఆరున్నం లక్షల మంది రైతులు ఉండగా.. ఇప్పటికే 5 లక్షల మందికి విశిష్ట గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ పూర్తయింది. రైతుకు ఒక విశిష్ట సంఖ్య ఇవ్వాలని సంకల్పించిన భారత ప్రభుత్వం ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఈ కార్యక్రమం ప్రగతి గురించి వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ జేడీలతో సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన రైతు సేవా కేంద్రాల్లో పని చేసే వ్యవసాయ ఉద్యాన సహాయకులతో నమోదు ప్రక్రియను చేపట్టారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన కింద లబ్ది పొందే రైతు కుటుంబాల ఆధారంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేశారు. రైతు రిజిస్ట్రేషన్ చేయించుకున్న సమయం లోనే రైతు సెల్‌కు పంపిన సంఖ్య తాత్కాలికమే అయినప్పటికీ ఆ తర్వాత భారత ప్రభుత్వం జారీ చేసే సంఖ్య విశిష్ట సంఖ్య కానుంది. ఆ సమయంలోనే రైతుకు ఒక గుర్తింపు పత్రం కూడా జారీ చేస్తారు. సొంత భూమి కలిగిన రైతులకు ఈ సంఖ్య జారీ అవుతుంది. ఆ విశిష్ట గుర్తింపు కార్డులో సాగు భూమి వివరాలు, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ తదితర ఆధారాలతో వ్యవసాయ శాఖ సహాయకు లను కలిసినప్పుడు నమోదు చేసి ఇటీవల ఒక సంఖ్యను రైతు సెల్‌ఫోన్‌కు పంపారు. ప్రభుత్వం రైతులకు అమలు చేసే వివిధ పథకాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా, పెట్టుబడి రాయితీ, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పచ్చిరొట్టె విత్తనాలు, భూసార పరీక్షలు, వర్షాలు ఆయా సీజన్లలో ఎంత మొత్తంలో కురిసేది, మార్కెటింగ్ శాఖలో వసతులు ప్రయోజనాలు ఇలా అనేక రకాల పథకాలు, కార్యక్రమాలు రైతుకు అందాలంటే ఇకపై ఈ విశిష్ట సంఖ్యనే ఆధారం కానుంది.

ఐదేళ్ల వైసీపీ పాలనలో విధ్వంసం



నన్నారీ తయారీని పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి

5వ పేజీ తరువాయి

టైగర్ ప్రాజెక్ట్ పేరిట చెంచులను అటవీ శాఖ అధికారులు అడవుల నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె దృష్టికి తీసుకురాగా అలాంటివేమి జరగవని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పరిపాలనలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా నిలిచాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబర్ వెల్ఫేర్ డైరెక్టర్ సదాభార్గవి, నంద్యాల కలెక్టర్ రాజకుమారి, ఆలయ ఈవో శ్రీనివాసరావు, శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, తహసీల్దార్ రత్నరాధిక, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ షాబుద్దిన్, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్ ఉన్నారు. మంత్రి పర్యటనను ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, అర్బన్ సీఐ రాము పర్యవేక్షించారు.

రూ.కోటి నిధులతో మార్కెటింగ్ సెంటర్ : శ్రీశైలం దేవస్థానం పరిధిలో రూ.కోటి డీఏ-జగ్వే నిధులతో నిర్మించనున్న ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్‌ను బుధవారం మంత్రి గుమ్మడి సంధ్యారాణి, శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్యలు ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెటింగ్ సెం టర్ వరం లాంటిదని అన్నారు. ఈ కేంద్రం ఏర్పాటైతే శ్రీశైలం, పరిసర ప్రాంతాల్లోని గిరిజన సమాజానికి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కొత్త దశ లభిస్తోందని అన్నారు. గిరిజనులు ఉత్పత్తి చేసే వివిధ దిగుబడులు, వనరులు, వనజన్య ఉత్పత్తులు, హస్తకళలు, చిన్న తరహా పరిశ్రమల ఉత్పత్తులు మధ్యవర్తుల ప్రమేయం లేకుం డా తగిన ధరలకు నేరుగటా విక్రయించుకునే వెసులుబాటు కలుగుందని అన్నారు.

కర్నూలు- విజయవాడకు బస్సు సర్వీసు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ సంస్థ అధ్వర్యంలో కర్నూలు నుంచి విజయవాడకు ప్రతిరోజు రాత్రి బస్సు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు డివిజనల్ మేనేజర్ లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి ప్రతి రోజు రాత్రి 9 గంటలకు నాన్-ఏసీ హైటెక్ బస్సును ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బస్సు కర్నూలులోని హరిత హోటల్ నుంచి బయలుదేరి ఆర్టీసీ బస్టాండు, రాజవిహార్, ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా విజయవాడలోని కంకిపాడు, పోరంకి, గోశాల మీదుగా ఆటోనగర్ ప్రాంతాల వరకు వెళ్తుందన్నారు. పెద్దలకు రూ.850, పిల్లలకు రూ.680 చార్జీలు వసూలు చేస్తారన్నారు. అదే విధంగా నంద్యాల ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రతి రోజు రాత్రి 11 గంటలకు విజయవాడకు బస్సు ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9989253387(కర్నూలు), 9010177055 (నంద్యాల) నంబర్లను సంప్రందించాలన్నారు.

రైతన్నలు తస్మాత్ జాగ్రత్త

- పాముల రూపంలో పొంచి ఉన్న ప్రమాదం
- నాటు వైద్యంను ఆశ్రయించొద్దు
- ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స ఎంతో మేలు

గోనెగండ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పొలాల్లో పాముల సంచారం అధికంగా ఉంటుంది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి లేక పోతే పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో పాముల అధికంగా సంచరిస్తుంటాయి.

ఇటీవల జిల్లాలో పాముకాటుకు గురై మృతి చెందిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. గోనెగండ్ల మండలంలో ఆరు నెలలో దాదాపు నలుగురు పాముకాటుకు గురై మృతి చెందారు. ప్రభుత్వం ఏఎస్వీ (యాంటీ స్నేక్ వీనమ్) అనే మందును ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచుతుంది. చాలాగ్రామాల్లో నాటు వైద్యంను నమ్ముకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.

పాముల్లో రకాలు:

మన దేశంలో 250 రకాల పాములున్నాయి. 52రకాల జాతులు మాత్రమే మనిషికి ప్రమాదాన్ని చేయగలవు. అందులో విషసర్పాలు ఐదు రకాలు. తాచుపాము, కట్లపాము, రక్తపింజరి, సాస్కేల్డే, హంప్ పిట్ వైపర్. వీటిలో తాచుపాము, రక్త పింజరి, కట్లపాము మాత్రమే మన ప్రాంతంలో ఉంటాయి. నాలుగో రకమైన సాస్కేల్డ్‌వైపర్ ఉత్తర భారత దేశంలో ఉంటాయి. సముద్ర పాములన్నీ విషపూరితాలే అయితే మన దేశంలో ఆ పాము కాట్లు చాలా అరుదు.

యాంటీ స్నేక్ వీనమ్ తోనే..

పాము కాటుతో విషం ఎక్కితే కేవలం యాంటీస్నేక్ వీనమ్‌తో తప్ప మరే వైద్యంతో మనిషి బతికే అవకాశం లేదు. పాము కాటుకు గురైన వారు తప్పని సరిగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకోవాలి.

పాముకాటు వేస్తే ఏమిచేయాలి

పాము కరిచినప్పుడు ఏపాము కరిచిందో గుర్తించేందుకు ప్రయత్నించాలి. అట్లాగని సమయాన్ని వృథా చేయరాదు. పాము కాటేసిన పైభాగంలో గుడ్డను బాగా బిగించి కట్టాలి. రోగిని నడిపించకుండా ప్రత్యేక వాహనంలో వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లాలి. నోటి ద్వారా రోగికి ఎలాంటి ఆహారం ఇవ్వకూడదు. నాటు పసరు, మంత్రపు నీరు అంటూ కాలయాపన చేయరాదు. రోగికి ధైర్యం చెప్పాలి.



చికిత్స: రోగికి ఆహారం ఇవ్వకుండా సెలైన్ ఎక్కిస్తారు. ధనుర్వాతం రాకుండా ఉండేందుకు టెట్వాక్ ఇంజెక్షన్ చేస్తారు. యాంటీ స్నేక్‌వీనమ్ ఇంజెక్షన్లు ఇస్తారు. పరిస్థితి విషమిస్తే ఐసీయూ, వెంటిలేటర్ సౌకర్యం ఉన్న ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు. పాముకాటు బాధితుడికి రక్తం పరీక్షచేసి విష ప్రభావాన్ని కనుగొనే అవకాశముంది.

ఆసుపత్రికి తీసుకెళ్లాలి



గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటుకు ప్రజలు ఎక్కువగా గురవుతుంటారు. పాము కరిచిన వెంటనే కాటువేసిన భాగంకు పైభాగాన దారంతో కానీ గుడ్డతో కానీ గట్టి కట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. దాదాపు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందు తప్పని సరిగా ఉంటుంది.

● రంగారవళి, వైద్యురాలు, గోనెగండ్ల



పొలంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు



ఎద్దులతో పొలాన్ని దమ్ము చేస్తున్న రైతు

నీరు పుష్కలం.. సాగుకు సమాయత్తం

- పెరిగిన భూగర్భజలాలు
- విస్తారంగా వరి, మొక్కజొన్న సాగు
- పొలాల్లో సందడి వాతావరణం

అవుకు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జీఎన్ఎస్ఎస్(గాలేరు నగరి సుజల స్రవంతి) కెనాల్, ఎస్సార్బీసీ(శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్) కాల్వ ద్వారా నీరు వచ్చి చేరుతుండటంతో అవుకు రిజర్వాయర్‌లో 3.50టీఎంసీ నీటి నిల్వ ఉంది. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు చేరటంతో మండల వ్యాప్తంగా 20వేలు ఎకరాల్లో రైతులు పంటలను సాగుచేస్తున్నారు. దీంతో పొలా ల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. కురుస్తున్న వర్షాలతో ఉప్పలపాడు హాయత్‌ఖాన్ చెరువు, కునుకుంట్లలోని దీక్షితులవారి చెరువు, శింగనపల్లెలోని పర్క్యులేషన్ ట్యాంకు నిండిపోయాయి. ఎస్సార్బీసీ ద్వారా వస్తున్న నీటితో మెట్టుపల్లె బాలికుంట చెరువు, వేములపాడు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. రిజర్వాయర్‌కు నీరు చేరటం, కురుస్తున్న వర్షాలతో భూగర్భజలాలు పెరగటంతో బోర్లు, బావుల కింద పంట లను రైతులు సాగు చేస్తున్నారు. కొన్నిచోట్ల వరి నాటుకు పొలాలను ట్రాక్టర్లతో, ఎద్దులతో దమ్ము చేస్తుండగా, మరికొన్ని చోట్ల వరి నాట్లు వేస్తున్నారు. మండలంలో వరి 10వేలు ఎక రాలు, మొక్కజొన్న 5వేలు ఎకరాలు, మిరప 2వేలు ఎకరాలు, కంది 800 ఎకరాలు, మినుము 210 ఎకరాలు, సాగు అవుతుండగా మిగతా పొలాల్లో వేరుశనగ, పత్తి, పసుపు, హార్టికల్చర్ పంటలను సాగుచేస్తున్నారు.



నాటుకు సిద్ధంగా ఉన్న వరి నారు

నాడు 50 బస్తాలు.. నేడు 10 బస్తాలే..!

- గణనీయంగా తగ్గిన పచ్చిమిర్చి దిగుబడి
- 50 కేజీల బస్తా రూ.1,000 మాత్రమే
- తెగుళ్లతో రైతులు కుదేలు
- ప్రభుత్వమే ఆదుకోవాలని మొర



డి.వనిపెంట పొలంలో కుప్పగా పోసిన పచ్చిమిర్చి

చాగలమర్రి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పచ్చిమిర్చి నాడు ఎకరానికి 40 నుంచి 50 బస్తాలు దిగుబడి రాగా ఈఏడాది 2 బస్తాల నుంచి 10 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ధర కూడా వారం రోజుల క్రితం 50 కేజీల బస్తా ధర రూ.3వేలు పలకగా ప్రస్తుతం రూ. 1,000 మాత్రమే పలుకుతోంది. దిగుబడి గణనీయంగా తగ్గడం, మిర్చి పంటను తెగుళ్లు కూడా దెబ్బతీశాయి. రుద్రవరం, చాగలమర్రి, శిరివెళ్ల, పాణ్యం, బనగానపల్లె మండలాల్లో పచ్చిమిరప సాగు చేస్తున్నారు. జిల్లాలో 12,362 హెక్టార్లలో సాధారణంగా మిర్చి సాగు చేస్తుంటారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 4,420 హెక్టార్లు మాత్రమే సాగు చేశారు. తెగుళ్ల వల్ల మిరప దెబ్బతింటుండటంతో రైతులు సాగువైపు ఆసక్తి చూపడం లేదు. దీంతో సాగు విస్తీర్ణం తగ్గింది.

సబ్‌డివిజన్ పరిధిలో ఇలా..

ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని చాగలమర్రి, రుద్రవరం, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, శిరివెళ్ల, దొర్నిపాడు మండలాల్లో 1,000ఎకరాల దాకా పచ్చిమిర్చి పంట సాగుచేశారు. ఒక్క చాగలమర్రి, రుద్రవరం మండలాల్లో 500 ఎకరాలకు పైగా మిరప పంట సాగు చేశారు. కాయలు కోత సమయంలో 50 బస్తాల ధర రూ.1,000 మాత్రమే పలుకుతోంది.

ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి

ఎకరాకు సుమారుగా 40 వేల మొక్కలను నాటుతున్నారు. మందులు, కూలీలు, కలుపు నివారణ కోసం ఎకరాకు రూ.80 వేలు నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది తెగుళ్ల సోకడం, దిగుబడి లేకపోవడంతో ఎకరాకు రూ.20వేలు కూడా రావడం లేదు. ఒక్కో ఎకరాకు సుమారు రూ.60వేలు వరకు నష్టపోతున్నారు. కూరగాయల మార్కెట్‌లో కేజీ రూ.50 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కూరగాయలు సాగు చేసే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

తెగుళ్లతో నష్టపోతున్నాం



రెండెకరాల్లో మిరప పంట సాగు చేశా. ఎకరాకు రూ.90వేలు పెట్టుబడి పెట్టా. తెగుళ్లతో పంట భారీగా దెబ్బ తింది. వచ్చిన మిరప పంట కూలీలకు, రవాణా ఖర్చులకే సరిపోతున్నది.

● ఈశ్వర్‌రెడ్డి, రైతు, కొత్తపల్లె

తెగుళ్లు సోకి తగ్గిన దిగుబడి



మిరప పంటకు తెగుళ్లు సోకి దిగుబడి తగ్గింది. ఆశించిన ధర ఉన్నా పంట దిగుబడి లేక నష్టపోతున్నాం. మిరప పంట సాగుకు ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశా. పండిన పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే రవాణా ఖర్చులు కూడా రావడం లేదు.

● బయన్న, రైతు, డి.వనిపెంట

అయ్యో... పాపం!


కిన్నెర సాయి


మహబూబ్‌బాషా


భీమేష్


వినయ్


శశికుమార్


సాయికిరణ్

మృత్యువు ఎప్పుడు.. ఏ రూపంలో వస్తుందో ఎవరు ఊహించగలరు. సంతోషంగా ఉన్నవారిని సడన్‌గా తన ఒడిలో లాగేసుకుంది. కన్నవాళ్లకు గర్భశోకం మిగిల్చింది. మృత్యువు కబళించిన తీరు చూస్తే అయ్యే పాపం.. ఎంత ఘోరం..! జరిగిందంటూ అందరి చేత కన్నీళ్లు పెట్టిస్తుంది. పదేళ్లకే నూరేళ్ల నిండాయి ఆ చిన్నారులకు.. సరదా కోసం వెళ్లి మృత్యుఒడికి చేరి కన్నవారికి కడుపు కోత మిగిల్చారు ఆ ఆరుగురు.. వారంతా పదేళ్ల చిన్నారులు.. ఒకే పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నారు.. మిత్రులంతా కలిసి ఆడుతూ పాడుతూ బుధవారం ఒడికి వెళ్లి వచ్చారు. సరదా కోసం గుంత వద్దకు వెళ్లారు. స్నాన్నం చేసేందుకు గుంతలో దిగారు. ఒక్కరి తర్వాత ఒకరు రక్షించండి.. రక్షించండి అంటూ రోదనలు పెట్టారు. వారి రోదనలతో భయపడ్డ ఒడ్డున ఉన్న చిన్నారి పరుగుపరుగున వెళ్లి జనాన్ని పిలుచుకు వాడు. అప్పటికే వారిలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. ఒకరు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈఘటనతో చిగిలి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.


సంఘటనా స్థలం వద్ద గుమికూడిన ప్రజలు

కర్నూలు/ఆస్పరి/ఆదోని/ఆదోని రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యోపాపం ఎంత ఘోరం జరిగిందంటూ బుధవారం చిగిలిలో జరిగిన విషాద ఘటన ఊరు ఊరినే కన్నీటి శోకసంద్రంలో ముంచేసింది. ఉదయం నుంచి సాయంకాలం దాకా బడిలో గురువులు చెప్పే పాఠాలు శ్రద్ధగా విన్నారు. తోటి విద్యార్థులతో కలసి సందడి చేశారు. బడి వదలగానే గ్రామ సమీపంలోని ఎర్రగరుసు నీటి గుంతల్లో సరదాగా స్నానాలు చేయాలని అనుకున్నారో ఏమో.. ఇంటికెళ్లి పుస్తకాల సంచులు పెట్టేసి ఐదు తరగతి చదివే ఏడుగురు విద్యార్థులు ఆ నీటి గుంట వద్దకు చేరు కున్నారు. నీటిలో దిగి క్షణాల్లో ఆనీటిలో మునిగిపోయారు. నీటి మునుగుతూ రక్షించండి.. రక్షించండి..! అంటూ చిన్నా రులు ఆర్తనాదాలు అరణ్య రోధనే అయ్యాయి. ఆరుగురు విద్యార్థులు మృత్యుఒడి చేరారు. గట్టున మరో విద్యార్థి చెప్పడంతో ఈ ఘోరం బయటకు తెలిసింది. లేదంటే ఎప్పటికి తెలిసేదో..! కన్నవాళ్లు, బంధువుల శోకంతో చిగిలి పల్లెవీధులు తడిసి ముద్దాయ్యాయి. ఆస్పరి మండలం చిగిలి గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు దాదాపు 110 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఐదవ తరగతిలో 25మంది విద్యార్థులు ఉన్నారు. అందరు విద్యా ర్థులతో పాటుగా ఎర్రబాట శశికుమార్(10), ఎర్రబాట కిన్నెరసాయి(10), కేసరం సాయికిరణ్ (10), ఉప్పలపాటి బీమా (10), గడ్ల వినయ్ (10), షేక్ మహబూబ్ (10), దుర్గాప్రసాద్ ఉదయం బడికి వెళ్లారు. గురువులు చెప్పిన పాఠాలు ఎంతో శ్రద్ధగా విన్నారు. నోట్ పుస్తకాలు రాసుకు న్నారు. మధ్యాహ్న భోజనం బడిలోనే తిన్నారు. తోటి విద్యార్థులు, మిత్రులతో ఎంతో ఆనందంగా, సందడిగా గడిపారు. సాయంత్రం బడి వదిలే వేళాయింది. అప్పుడు సమయం 3.35 గంటలు. ఇంటికి వెళ్లే బడి గంట (లాంగ్ బెల్) మోగింది. ఆ ఏడుగురు విద్యార్థులు ఇళ్లకు చేరుకొని.. పుస్తకాల సంచులు ఇంట్లోనే పెట్టేసి ముందే అనుకున్నట్లు సాయంత్రం 4.15 గంటలకు గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్న ఎర్రగరుసు తవ్వకాలు చేసిన గుంతల్లో వర్షపు నీరు ఆగిన నీటి గుంత వద్దకు చేరుకున్నారు. ఎర్రబాట శషికుమార్, ఎర్రబాట కిన్నెరసాయి, కేసరం సాయికిరణ్, ఉప్పలపాటి బీమా, గడ్ల వినయ్, షేక్ మహబూబ్‌లు ఆడుకుంటూ సరదాగా నీటిలోకి దిగారు. ఆ గుంతలో మట్టిలో ఇరుక్కుపోయి భయంతో నీటిలో మునిగిపోయారు. అయితే.. గట్టున ఉన్న దుర్గాప్రసాద్ నీట మునుగుతున్న మిత్రులను చూసి భయంతో ఊర్లోకి పరుగు పెడుతూ వచ్చి చెప్పడంతో ఘోరం బయట ప్రపంచానికి తెలిసింది. స్థానికులు వెళ్లి నీటిలో మునిగిపోయిన చిన్నారులను బయటకు తీశారు. అప్పటికే ఎర్రబాట శషికుమార్, కేసరం సాయికిరణ్, ఉప్పలపాటి బీమా, గడ్ల వినయ్, షేక్ మహబూబ్ మృతి చెందగా, ఎర్రబాట కిన్నెరసాయి ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రలిస్తుం డగా కన్నుమూశారు. చిన్నారులు నీటి మునిగిపోతూ రక్షించండి.. కాపాడండి.. అంటూ గట్టిగా కేకలు వేశారని, నాకు భయమేసి పరుగు పరుగున వచ్చి ఊర్లోవారికి చెప్పానని ప్రత్యేక్ష సాక్షి చిన్నారి దుర్గాప్రసాద్ చెబుతూనే భయంతో వణికిపోతున్నారు. చిన్నారుల ఆర్తనాదాలతో పాటు ప్రాణాలు కూడా క్షణాల్లో అనంతవాయువులో కలిసి పోయాయి. అంతా ఓగంటలో ఘోరం జరిగిపోయింది. ఆరుగురు తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది.

అన్నదమ్ముల ఇంట్లో విషాదం

ఎర్రబాట రాజు, కిష్టప్ప స్వయాన అన్నదమ్ములు. వ్యవసాయ పనులే వారి జీవనాధారం. మారతమ్మ, రాజు దంపతులకు ముగ్గురు కొడుకులు సంతానం కాగా ఎర్రబాట కిన్నెరసాయి చిన్నవాడు. నాగవేణి, కిష్టప్ప దంపతులకు ముగ్గురు కొడుకులు. శశికుమార్ చిన్నవాడు. అన్నదమ్ముల పిల్లలు కిన్నెరసాయి, శశి కుమార్ ఇద్దరు కూడా ఐదో తరగతి చదువుతున్నారు. నీటి గుంటలో పడి మృ త్యుఒడి చేరడంతో అన్నదమ్ముల ఇళ్లలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సీఎం చంద్రబాబు, మంత్రుల దిగ్భ్రాంతి

ఆరుగురు విద్యార్థులు నీటి కుంటలో పడి మృతి చెందారనే సమాచారం తెలియగానే సీఎం చంద్రబాబు కలెక్టరు పి.రంజిత్‌బాషాకు ఫోన్ చేసి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బస్తిపాటి నాగరాజు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి మృతుల కుటుంబాలను పరామర్శించారు. టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ చిన్నారుల మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరుగురిని బలి తీసుకున్న గరుసు గుంతలు



చిగిలి గ్రామానికి కిలో మీటరు దూరంలో సర్వే నంబరు 195 పరిధిలో 118 ఎకరాలు విస్తీర్ణంలో పచ్చని కొండలు ఉన్నాయి. ఆకొండల్లో నాణ్యమైన ఎర్రమట్టి ఉండడం అక్ర మార్కులకు వరంగా మారింది. ఆరేళ్లుగా గరుసు తవ్వకాలతో భారీ ఎత్తున గుంతలు పడ్డాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ గుంతలు వర్షపు నీటితో నిండిపోయాయి. ఆగుంతలకు అర కిలో మీటరు దూరంలో జడ్పీ ఉన్నతపాఠశాల, ఒకటిన్నర కిలో మీటరు దూరంలో మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల ఉంది. వర్షపు నీటితో నిండిన ఆ గుంతల్లో విద్యార్థులు స్నానాల కోసం నాలుగైదు రోజులగా వెళ్తున్నారని పోలీసులు పేర్కొంటు న్నారు.

ఆ నీటి గుంతల్లో స్నానాలు ప్రమాకరమని ఏ ఒక్కరు కూడా చెప్పలేదు. అక్రమంగా ఎర్రమట్టి తరలిం చేవాళ్లు కూడా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. అభం శుభం తెలియని చిన్నారులకు ఆ గుంతల్లో దిగితే మట్టిలో కూరుకుపోయి మృత్యువాత పడుతామనే పరిజ్ఞానం ఎక్కడి. నీళ్లు కనిపిస్తే చాలు సరదాగా ఈతాడుదామనే పిన్నవయస్సు వారిది. ప్రమాదమని తెలియక నీటి గుంటల్లో దిగి మృత్యువు కౌగిలికి చేరారు. చిన్నారుల మృతికి బాధ్యులెవరు..? అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేసి అమ్మకాలు చేపట్టిన అక్రమార్కులా..? నియంత్రిం చడంతో విఫలమైన అధికార యంత్రాంగమా..? సమాధానం లేని ప్రశ్నలు ఇవి.

మూడు కుటుంబాలకు ఒక్కొక్కరే కొడుకులు..

ఉప్పలపాటి లక్ష్మి, రాముడు దంపతులకు కొడుకు బీమా, ఇద్దరు కూతుళ్లు సంతానం. కేసరం మమత, మారాజు దంపతులకు కొడుకు సాయికిరణ్, కూతురు సంతానం. షేక్ హసీనా. పీరవలి దంపతులకు కొడుకు షేక్ మహబూబ్, ఒక కుమార్తె ఉంది. ఈ మూడు కుటుంబాలకు ఒక్కొక్కరే కొడుకు ఉన్నాడు. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ ఉన్నదాంట్లో బతికే కుటుంబాలు వారివి. విధికి వారిని చూసి కన్నుకుట్టిందేమో.. నీటి ప్రమా దం రూపంలో ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కబళించడంతో వారి ఇళ్లలో విషాదం అమలుకుంది. గడ్ల మల్లమ్మ, ఈరన్న దంపతులకు వినయ్ సహా ఇద్దర కుమారులు, కుమార్తె సంతానం. పెద్దవాడైన వినయ్ ఇలా కన్నుమూయడంతో కన్నవాళ్లు విలపిస్తున్న తీరు చూసిన ప్రతి ఒక్కరికి కన్నీరు పెట్టింది.

ఘటనాస్థలిని పరిశీలించిన అధికారులు

చిగిలిలో నీటి కుంటలో పడి ఆరుగురు చిన్నారులు మృతి చెందారనే సమాచారం రాగానే కలెక్టరు పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌లు పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, డీఎస్పీలు హేమలత, వెంకట్రామయ్య, ఆస్పరి తహసీల్దార్ రామేశ్వరరెడ్డి, సీఐ గంగాధర్‌ను అప్రమత్తం చేశారు. తక్షణమే వారు చిగిలికి చేరుకొని ఘటనాస్థలిని పరిశీలించారు. బాధిత కుటుంబా లను పరామర్శించారు. ఘటనకు దారితీసిన పరిస్థితులను తెలుసుకున్నారు. ఆదోని సబ్ కలెక్టరు మౌర్యభరద్వజ్ ఆదోని ప్రభుత్వాస్పత్రికి చేరుకొని కిన్నెరసాయి మృత దేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని సీఐ గంగాధర్ తెలిపారు.

తల్లిదండ్రులకు కడుపుకోత

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కలెక్టర్ రంజిత్ బాషా

ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో ఆరుగురు విద్యార్థులు మృత్యువాత పడటం చాలా దిగ్భ్రాంతికరం. చిన్నారుల మృతి తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చింది. చిగిలి ఘటనతో నా మనసు ఆవేదనతో నిండిపోయింది. ఆ చిన్నారుల ఆత్మకు శాంతి కలగాలి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నా. ఈ ఘటన చిన్నారుల కుటుంబాల్లో భరించలేని దుఃఖాన్ని మిగిల్చింది. ఈ ఘటన అత్యంత దురదృష్టకరం.

స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బలిజ మెరిట్ విద్యార్థుల పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రోపా (రాయల (బలిజ) అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి వెంకటే శ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్, ఆపై చదువులు గుర్తింపు పొందిన కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో చదువుతూ80 శాతం మార్కులు కలిగిన ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు ఈనెల 30 తేదీ లోగా దరఖాస్తులు పంపుకోవాలని సూచించారు. వివరాలకు ఆయా నియోజిక వర్గాల రోపా కార్యవర్గాన్ని, లేదా సెల్ నెంబరు. 85000 05992లో సంప్రదించాలని ఆయన కోరారు.

కూలిన మట్టి మిద్దె


కిందపడిన పైకపు మట్టి

బనగానపల్లె, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మడపల్లె గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బుధవారం తెల్లవారుజామున మట్టిమిద్దె కూలింది. గ్రామానికి చెందిన ఎద్దుల వెంకటేశ్వర్లుకు చెందిన మట్టిమిద్దె వర్షానికి తడిసి కూలిపోయింది. ఈప్రమాదంలో కుటుంబ సభ్యులు ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. బాధితుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తాము నివసిస్తున్న మట్టి మిద్దె కూలిపోయిందని, తనను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి
- మహిళా, జిల్లా జైళ్లలో తనిఖీలు


మాట్లాడుతున్న బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షా కాలాన్ని పూర్తి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. బుధవారం పంచలింగాలలోని జిల్లా జైలును, నగరంలోని మహిళా జైలును ఆయన తనిఖీ చేశారు. ఈజైళ్లలో ఏర్పాటుచేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లను తనిఖీ చేసి అక్కడున్న ఖైదీ లకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌లలో ఒక న్యాయవాది, ఒక పారా లీగల్ వలంటీర్లు ఉంటారని, వారు జైళ్లను సందర్శించి ఖైదీలకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందజేస్తారన్నారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందజేస్తామని, వారికి బెయిల్ తొందరగా మంజూరయ్యేలా కృషిచేస్తామని తెలిపారు. ఖైదీలను కోర్టు వాయిదాలకు కచ్చితంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన జైలు అధికారులను ఆదేశించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ న్యాయవాది శివరాం, జైలు అధికారులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్రాభివృద్ధికి సీఎం అహర్నిశలు కృషి
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర


పూజలు చేస్తున్న తుగ్గలి నాగేంద్ర

నంద్యాల కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని హోమాలు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం శ్రీశైలంలో కుమ్మరి శాలివాహన అన్నదాన సత్రంలో తుగ్గలి నాగేంద్ర దంప తుల ఆధ్వర్యంలో చండీ, గాయత్రీ హోమం నిర్వహించారు. సీఎం చంద్రబా రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తు న్నారని అన్నారు. ఆయనకు శ్రీశైల మల్లికార్జునస్వామి ఆశీస్సులు ఉన్నా యన్నారు. సీఎం ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి ారిని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో కుమ్మరి శాలివాహన సత్రం అధ్యక్షుడు బిక్షపతి, కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి రోశయ్య, ఐలాపురం శ్రీనివాసులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, కుమ్మరి శాలివాహన సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

బెలుం గుహలు అద్భుతం

- డీఐజీ కోయ ప్రవీణ్

కొలిమిగుండ్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధంగా భూఅంతర్భాగంలో ఏర్పడిన బెలుం గుహలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని డీఐజీ కోయ ప్రవీణ్ అభిప్రాయపడ్డారు. బుధవారం బెలుం గుహలను సందర్శించారు. కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు, గుహల యూనిట్ అధికారులు ఆయనకు స్వాగ తం పలికారు. అనంతరం గుహల్లోని ముఖ్య ప్రదేశాలైన ధ్యాన మందిరం, ఊడలమర్రి, సప్తస్వరాలు, సన్యాసి మఠం, పాతాళగంగ తదితర ప్రాంతాలను సందర్శించారు. గుహల చరిత్ర, ప్రాముఖ్యత గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈగుహలు ప్రపంచంలోనే రెండో అతి పెద్ద గుహలు కావడం గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు.


గుహలను తిలకిస్తున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు జీజీహెచ్‌లో వివాదం

- సూపరింటెండెంట్ వర్సెస్ ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ



కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిరంజీవులు మధ్య వివాదం రగులుకుంటోంది. ఆసుపత్రిలో అభివృద్ధి పనుల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. ఏకంగా సమీక్ష సమావేశం నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) బయటకు వెళ్లే వరకు వచ్చింది. బుధవారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో రూ.45 లక్షలతో నెఫ్రాలజీ, యురాలజీ, న్యూరో సర్జరీ ఆపరేషన్ థియేటర్ల మరమ్మతుల పనులు, ఇతర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆపరేషన్ థియేటర్ల పనులు ఆలస్యం అవుతున్నాయనీ, దీని వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. నాలుగు నెలలుగా పనులు సాగుతున్నాయనీ, గతంలో పని చేసిన ఇన్‌చార్జి ఈఈ కరీముల్లా వేగంగా స్పందించేవారనీ సూపరింటెండెంట్ చెప్పడంతో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ తీవ్ర అసహనానికి గురయ్యారు. పనుల నాణ్యతపై తనకు చెప్పకుండా ఏకంగా ఏపీఎంఎస్ఐడీసీ ఎండీకి ఎలా ఫిర్యాదు చేస్తారని ఈఈ ప్రశ్నించారు. తన సర్వీసు 35 సంవత్సరాలు ఉందని, తన ముందే గతంలో పని చేసిన ఇంజనీర్ అధికారిని పొగడటం ఏమిటన్నారు. ఏకవచనంతో పిలుస్తారా? అంటూ వాదనకు దిగారు. గతంలో పని చేసిన కరీముల్లాతోనే పనులు చేయించుకోండి అంటూ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఈ ఘటన ప్రస్తుతం జీజీహెచ్ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

సమస్యల పరిష్కారానికి 'పల్లెకు పోదాం'

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం వచ్చే వారం నుంచి 'పల్లెకు పోదాం' వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టామని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం ఉదయం సునయన ఆడిటోరియంలో 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహణపై 80 మంది పల్లెకు పోదాం స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నెలలో ఒకసారి పల్లెకు పోదాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందు రోజు రాత్రి మాత్రమే ఏ గ్రామానికి వెళ్లాలనే సమాచారాన్ని అధికారులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఉదయం 8:30 గంటలకు గ్రామానికి చేరుకుని పాఠశాలలో ప్రార్థనలో పాల్గొనాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, తమ తమ బృందాలతో స్పెషల్ ఆఫీసర్ వెంట వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు.

పునాదులకే పరిమితం..

- ముందుకు సాగని తరగతి గదుల నిర్మాణాలు
- వేధిస్తున్న గదుల కొరత
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో 'నాడు-నేడు' పేరుతో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలు పునాదులకే పరిమితమయ్యాయి. మొదటి, రెండు విడతల పేరుతో వేల కోట్లు మంజూరు చేశామని, పనులు చేపట్టాలంటూ అప్పట్లో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలో ఆర్భాటంగా మొదలుపెట్టిన అభివృద్ధి పనులు నిధుల కొరత కారణంగా ముందుకు సాగలేదు. రెండేళ్లు కావస్తున్నా నాడు-నేడు పనులపై స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు

రూ.1.47కోట్లతో ఆరు అదనపు గదులు

జిల్లాలో నాడు-నేడు రెండో విడత కింద కల్లూరు మండలం పెద్దపాడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రూ.1.47 కోట్లతో ఆరు అదనపు తరగతి గదుల పనులు చేపట్టారు. హడావుడిగా గ్రౌండ్‌ఫ్లోర్‌లో మూడు రూములకు పునాదులు వేశారు. నిధులు లేక వాటిని వదిలేశారు. ఒక్కొక్క గదికి రూ.13 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఇప్పటి వరకు అసంపూర్తి పనులకు రూ.15లక్షల వరకు ఖర్చు చేసి బేస్‌మట్టం వరకు పిల్లర్లు వేసి వదిలేశారు. పిల్లర్స్ కడ్డీలు వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ తుప్పు పడుతున్నాయి. బేస్‌మట్టంపైన పిచ్చిమొక్కలు పెరిగాయి.. ఈ పాఠశాలలో 267 మంది బాలికలు 6 నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. మెయిన్ భవనం పక్కనే ఉన్న పాత భవనాన్ని కూల్చేశారు. వాటి శిథిలాలు అలాగే వదిలేశారు. ఒకటి కంటే ఎక్కువ తరగతులను ఒకే గదిలో విద్యార్థులను కూర్చోబెట్టి ఉపాధ్యాయులు బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం వస్తే నీరు నిల్వ ఉండి అసౌకర్యంగా కనిపిస్తుంది. ఎన్డీయే ప్రభుత్వమైనా అసంపూర్తి పనులు తరగతి భవన నిర్మాణాల పనులు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెద్దపాడు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలల ప్రాంగణంలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

తహసీల్దార్లదే యూరియా పంపిణీ బాధ్యత

- ఎంఆర్‌పీకే అమ్మేలా చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలాల్లో యూరియా పంపిణీ బాధ్యత తహసీల్దార్లదే అని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సునయన ఆడిటోరియంలో రెవెన్యూ అధికారుల సమావేశంలో యూరియా పంపిణీపై కలెక్టర్ తహసీల్దార్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా మండలాల్లో రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలు, డీసీఎంఎస్‌లతో పాటు ప్రైవేటు ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని అన్నారు. ప్రైవేటు దుకాణాల్లో రెవెన్యూ సిబ్బందిని ఉంచి రైతులకు యూరియా అధిక ధరలకు కాకుండా నిబంధనల మేరకు ఎంఆర్‌పీకే విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియాతోపాటు లింకేజీ ఎరువులను రైతులకు అంటగట్టే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.. కౌతాళం, పెద్దకడుబూరు, హోళగుంద మండలాల్లో యూరియా పంపిణీపై వచ్చిన వార్తలపై కలెక్టర్ ఆయా మండలాల తహసీల్దార్లతో ఆరా తీశారు. ఈ ఆరోపణలపై నివేదికను వెంటనే తమకు పంపించాలని ఆదేశించారు.

ఆస్పత్రి గుర్తింపును రద్దు చేయాలి



జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఏవోకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి గర్భిణి మృతికి కారణమైన రక్ష హాస్పిటల్ గుర్తింపును రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే.శ్రీనివా సులు, నగర కార్యదర్శి బీసన్న, జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయ ఏవో కె.అరుణకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గర్భిణి మృతి చెంది 20 రోజులు కావస్తున్నా అధికారులు ఇంకా షోకాజ్ నోటీసులు, విచారణ పేరుతో తాత్సారం చేస్తున్నారన్నారు.

రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలి

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

కల్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు మండలం బస్తిపాడు, పర్ల అలాగే కల్లూరు అర్బన్‌లోని ముజఫర్‌నగర్, బళ్లారిరోడ్, వీకర్‌సెక్షను కాలనీలో నగర కార్యదర్శి శేషాద్రి, రాముడు కరపత్రాలను పంపిణీ చేశారు. గురుశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం రజకులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతుండటం దురదృష్టకర మని అన్నారు. పర్ల సుంకన్న, నాగేంద్ర, చంద్రన్న పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పండ్లతోటల రైతులు అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మదన్‌మోహన్ అన్నారు. బుధవారం మండంలోని కొత్తకోట, ముడుమాల గ్రామాలలో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన ఉల్లి, మిరప, బొప్పాయి, మునగ, దానిమ్మ, నిమ్మ తోటలను ఆయన పరిశీలించారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లు నిలిపివేయడం దారుణమన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి

ఓర్వకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఓర్వకల్లులోని బుగ్గరామేశ్వర డిగ్రీ కాలేజీలో సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. లెనిన్‌బాబు మాట్లాడుతూ ఓర్వకల్లు పారిశ్రామిక అభివృద్ధిగా ఏర్పడిందని, అయితే స్థానికులకు ఉద్యోగాలు, ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, సంజీవరాజు, బాబు, చిన్న పాల్గొన్నా రు.

పథకాలను పునరుద్ధరించాలి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌లో గతంలో అమలు చేసిన పథకాలన్నీ పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ నాయకుడు ఎన్ వెంకట రామరాజు కోరారు. బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర టీడీపీ కార్యాలయంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఈ ఏడాది సెప్టెంబరు 7న నంద్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని బుచ్చి రాంప్రసాద్ ఆహ్వానపత్రం అందజేశారు. వెంకటరామరాజు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ కార్పొరేషన్ గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్వీర్యమైపోయిందని విమర్శించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి నగరడోణ సుధీర్, నాయకులు మారుతి, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి





రాజీవ్‌గాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు జిలానీబాషా, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహాయాదవ్ తదితరులు

కర్నూలు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దివంగతి ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ షేక్ జిలానీ బాషా, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిలాని బాషా మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సారథి రాజీవ్ గాంధీ అని, కంప్యూటర్, కమ్యూనికేషన్ల రంగంలో అధునిక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో కొత్త పుంతలు తొక్కిన భారత్ ఇవాళ ఈ ఫలితాల వల్లే అన్ని రంగాల్లో ప్రపంచ దేశాల్లో ముందున్నదని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న, కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ, ఎన్‌సీ బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, బొగ్గుల హైమావతి, సయ్యద్ ఖాద్రీ, సలోమీ పాల్గొన్నారు.

కల్లూరు: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం నంద్యాల పార్లమెంట్ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జే.లక్ష్మీనరసింహాయాదవ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. లక్ష్మీనరసింహాయాదవ్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ గొప్ప దార్శనికుడని, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషను కల్పించిన మహనీయుడని కొనియాడారు.

అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించండి

ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 16 వార్డులో టెండరు ప్రక్రియ పూర్తైన అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నగరపాలక సంస్థ కమిషనర్ విశ్వనాథ్‌తో కలిసి అభివృద్ధి పనులపై సమీక్షించారు. గౌరు చరిత మాట్లాడుతూ కల్లూరు శివారు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, అత్యధిక ఆదాయం అందించే కల్లూరు 16 వార్డులపై నిర్లక్ష్య వైఖరి సరికాదని అసహనం వ్యక్తం చేశారు. రోడ్లు, డ్రైనేజీల టెండర్లు పూర్తయిన పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



టీజీ వెంకటేశ్ దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ ఈవో, అర్చకులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేయాలని సీఎం చంద్రబాబును రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కోరారు. ఈ క్షేత్రానికి రహదారులు, ఇతర మౌలిక వసతుల కల్పనకు మంత్రి టీజీ భరత్ ద్వారా ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకుపోయేలా కృషి చేస్తానని అన్నారు. బుధవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులు ఈరన్న స్వామి వారిని దర్శించుకున్నారు. టీజీ వెంకటేశ్ దంపతులకు ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. టీజీ వెంకటేశ్ దంపతులు ఈరన్న స్వామికి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నన్నూరు గ్రామంలో దళిత భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం మండ లంలోని నన్నూరులో దళిత భూములను ఆయన పరిశీలించారు. రామకృష్ణ మాట్లాడుతూ దళితులు 70 సంవత్సరాలుగా 1992 సర్వే.నెం.లో భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, వాటికి 2008లో ప్రభుత్వం గుర్తించి పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేసిందని అన్నారు. ఆ భూముల్లో వేసిన కంది పంటను ట్రాక్టర్లతో దున్ని నాశనం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దళితులు లక్ష్మీదేవి, శంకరమ్మ, బాలమ్మ ఆ పొలాల్లో ముళ్లపొదలు తొలగించి సాగు చేసుకుంటున్నారని, బయటి వ్యక్తు లతో పంటలను నాశనం చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నాగన్న, కృష్ణ, మధుసూదన్, బషీర్, లింగేశ్వరుడు, సంజీవుడు, రవికుమార్ పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి: సీపీఐ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పట్టణంలో ఈ నెల 23 నుంచి 25 తేదీ వరకు జరిగే సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఆర్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబుతో కలిసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథం, సి.మహేష్, నాగరాజు పాల్గొన్నారు.

సవరణతో బిల్లుతో నేరగాళ్లకు చెక్

కర్నూలు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 130వ రాజ్యాంగ సవరణ బిల్లుతో నేరగాళ్లకు చెక్ పడనుందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాజ్యాంగ సవరణ ద్వారా అమలు లోకి వచ్చే కొత్త చట్టాలవలన భవిష్యత్తులో సామాన్యుడు సైతం రాజకీయ రంగంలోకి వచ్చి ప్రజలకు సేవ చేసే అవకాశం ఉంటుందన్నారు. రాజకీయం అంటే ప్రజలకు సేవ చేసే ఒక మంచి మార్గం. కానీ నేడు జగ న్మోహన్‌రెడ్డి లాంటి వ్యక్తులు అవినీతితో రాజకీయ రంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు.

శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి: డీఎస్పీ

కర్నూలు క్రైం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని డీఎస్పీ బాబు ప్రసాద్ అన్నారు. బుధవారం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీల్లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో తనిఖీలు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్ మాట్లాడుతూ కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సీఐలు విక్రమ సింహ, శ్రీధర్, శేషయ్య, పార్థసారధి, మహే శ్వరరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

పనితీరు మెరుగుపడాలి: కమిషనర్

కర్నూలు కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పనితీరు మెరుగుపడకపోతే చర్యలు తీసుకుంటామని కమిషనర్ పి. విశ్వనాథం పట్టణ ప్రణాళిక విభాగ సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం నగరంలోని ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోగల నగరపాలక సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక సిబ్బంది, ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకంపై రియల్టర్లకు, స్థల యజమానులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాషా పాల్గొన్నారు.

అధికారులపై విచారణ చేపట్టాలి

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతి గృహంలో పని చేస్తున్న వార్డెన్ జి.సుంకన్న, ఏఎన్‌డబ్ల్యూవో మద్దలేటిపై విచారణ చేపట్టాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఉల్చాల మద్దిలేటి, లంబాడీ సంఘం రాష్ట్ర నాయకులు యోగేష్ నాయక్, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కుశలన్న బుధవారం కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు.

దోమల నివారణపై అవగాహన



ఓర్వకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఓర్వకల్లు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. ర్యాలీలో జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఏఎన్ఎం మహేశ్వరమ్మ మాట్లాడుతూ దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులు వస్తాయని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం లద్దగిరి గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్ఈవో శ్రీనివా సయాదవ్, సీహెచ్‌వో శాంత, ఎల్‌టీ జకీర్, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: దోమకాటుతో మలేరియా, డెంగీ చికున్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ హెచ్చరించారు. నగరంలోని ముజఫర్‌నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల నుంచి వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నార. అనంతరం ముజఫర్ నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషినల్ డీఎంహెచ్‌వో డా. ఎల్.భాస్కర్, డీపీఎంవో డా.ఉమా, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డా.మహేశ్వర ప్రసాద్, డీఎంవో నూకరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, డెమో శ్రీనివాసులు శెట్టి, మెడికల్ ఆఫీసర్ డా.జ్యోతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కల్లూరు: దోమల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కల్లూరు ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్లు ఎస్.శైలేష్, మోతిలాల్ నాయక్ అన్నారు. బుధవారం దోమల దినోత్సవంలో భాగంగా కాలనీల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రంగస్వామి, నారాయణమ్మ, సంపత్‌కుమార్, సత్యం, పాల్గొన్నారు.

సంజీవయ్య జిల్లాగా నామకరణం చేసేంత వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా, కుల సంఘాల నాయకులు

కర్నూలు అర్బన్/ ఎడ్యుకేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య జిల్లాగా నామకరణం చేసేంత వరకు పోరాడాలని పలు ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరం లోని పాతబస్టాండ్ సమీపంలోని చెన్న కేశవ స్వామి కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. భవిష్యతు కార్యాచరణకు సంజీవయ్య జిల్లా సాధన సమితి అధ్యక్ష, కార్యదర్శులు, సలహాదారులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా సాధ న సమితి గౌరవ అధ్యక్షులు నక్కల మిట్ట శ్రీనివాసులు, దామోదరం రాధకృష్ణమూర్తి, రామశేషయ్య, టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు, జెవీ కృష్ణయ్య, పోతుల శేఖర్, జనసేన నాయకులు రాంబాబు, నాగరాజు పాల్గొన్నారు.

డిప్లమో ఎలైడ్ హెల్త్ కేర్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లమో కోర్సులకు దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించినట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో చేరేందుకు ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపులో పాస్ అయిన విద్యార్థులకు సెప్టెంబరు 8 వరకు అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. తమ కాలేజీ కన్వీనర్, మేనేజ్‌మెంటు కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు కర్నూలు కిమ్స్ హాస్పిటల్ క్యాంపస్ జోహరాపురం, కర్నూలు ఫోన్ నెంబర్లు 7331118019, 7680945357ను సంప్రదించాలని సూచించారు.

ఖమ్మంలో చెన్నంచెట్టిపల్లె వాసి మృతి

ఓర్వకల్లు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంచెట్టిపల్లె గ్రామానికి చెందిన బోయ తిరుమలేష్ (22) అనే డ్రైవర్ తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున మృతి చెం దాడు. మృతుడు కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో బొలేరో వాహనంలో మిర్చిని తీసుకుని తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు వెళ్తుండగా డీవైడర్ ఢీకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి బోయ యాగంటి, తల్లి రేణుకమ్మ శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మంకు బయలుదేరి వెళ్లారు. గ్రామంలో విషాదఛాయలు అలు ముకున్నాయి.

హక్కుల పరిరక్షణ సమష్టి బాధ్యత

కర్నూలు కల్చరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల హక్కులను పరిరక్షించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషి చేయాలని డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శివ రామచంద్రరావు అన్నారు. బుధవారం బి.క్యాంపు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల్లో పీసీఆర్ చట్టం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా విచ్చేసిన శివ రామచంద్రరావు మాట్లాడుతూ యువత చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యుడు రాయపాటి శ్రీనివాస్ ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు వెంకటస్వామి, ఆర్ కామ్లినాయక్, జి.హేమంత్, రోషన్న పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ను ఎంపీ బస్తిపాటి నాగరాజు కలిశారు. బుధవారం ఢిల్లీలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు, ఎన్డీఏ ఎంపీల సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఎంపీ నాగరాజు ఉప రాష్ట్రపతి ఎన్డీఏ అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నగర సమగ్ర ప్రగతే లక్ష్యం: మేయర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగర సమగ్ర ప్రగతే లక్ష్యంగా అభివృద్ధి పనులకు నిధులు ఖర్చుచేస్తున్నట్లు నగర పాలక మేయ ర్ బీవై.రామయ్య అన్నారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. మొత్తం 12 తీర్మానాలకు .రూ.4 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. కమిషనర్ విశ్వనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'తో మహిళా సాధికారత

కర్నూలు అర్బన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకంతో మహిళా సాధికారత సాధ్యమని టీడీపీ జిల్లాఅధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగానాల్లో ఉచిత బస్సు హామీని అమలు చేశామన్నారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అవకాశం కల్పించారని తెలిపారు.

భారతదేశ ఔన్నత్యంపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బుధవారం భారతదేశ ఔన్న త్యంపై అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా సంస్కృత అధ్యాపకులు శ్రీనివాసులు హాజరై భారతదేశ ఔన్నత్యాన్ని, రాష్ట్రాల మధ్య సాంస్కృతిక వైవిధ్యం వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. పవన్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిర్వహించండి



• మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించనున్న వినాయక ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పనులు చేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సీహెచ్ లోకేశ్వరి సూచించారు. ఈమేరకు బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాత్రి సమయాల్లో మహిళలు వచ్చే అవకాశం ఉందని, రహదారులపై గుంతలకు ప్యాచ్‌వర్క్ చేయించాలని, వీధి దీపాలక మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ కృష్ణ, రామమూర్తి ,ఇన్‌చార్జి అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాల ముద్దయ్య శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజనులకు విద్య అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వయోజనులకు విద్య అవసరమని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో 'ఉల్లాస్ అక్షరాంధ్ర' నిర్వహించారు. చదువుకు వయసుతో సంబంధంలేదని, వయోజనులు అక్షరజ్ఞానం నేర్చుకోవాలని కోరారు. సర్పంచ్ మల్లికార్జున, ఏపీఎం నాగార్జున, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్‌స్వామి ఉన్నారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం



ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్న సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నులిపురుగులను నిర్మూలిద్దామని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపించేశారు. విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మండగిరి హెల్త్ సెంటర్ వైద్య ఆరోగ్య శాఖ సీహెచ్‌వో శ్వేత ఏఎన్ఎం లక్ష్మి, ఆశావర్కర్‌లు నాగవేణి, లతా, భారతి, శాంతి పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలకు తాగునీరు



కొళాయిని ప్రారంభిస్తున్న సర్పంచ్ మల్లికార్జున

హాలహర్వి, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): స్థానిక కస్తూర్బా పాఠశాలలో తాగునీటి కొళాయిని సర్పంచ్ మల్లికార్జున బుధవారం ప్రారం భించారు. తాగునీటి కోసం విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయని ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు.

వెల్దుర్తిని కర్నూలు జిల్లాలోనే ఉంచాలి

వెల్దుర్తి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచాలని టీడీపీ నాయకుడు సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ బలరాం గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా వెల్దుర్తిని, కొత్తగా ఏర్పాటుచేయబోతున్న ఆదోని జిల్లాలో కలపనున్నారని వార్తలు వస్తున్నాయన్నారు. కర్నూలుకు వెల్దుర్తి సమీపంలో ఉన్నందున అలాగే ఉంచాలన్నారు. రామళ్లకోట రామకృష్ణాచారి, సుధాకర్‌గౌడ్ ఉన్నారు.

కోసుకుపోయిన దారి



మండలంలోని చింతకుంట నుంచి బేవినహాల్ రహదారి భారీ వర్షాలకు కోసుకుపోయింది. దాదాపు 10 కమి.ల రహదారి ఇగాగే ఉంది. అలాగే మండలంలోని కొక్కరచేడు, బేవినహాల్ మధ్య వంతెన కూలిపోయింది. రోడ్డంతా గుంతలతో ఉండటంతో వర్షం ప్రభావానికి బురదతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిని బాగుయాలని వారు కోరుతున్నారు. **- హాలహర్వి**

రహదారిపై బురద



తుగ్గలి- కేపీ గుడిసెల-లంకాయపల్లె మధ్య రహదారి బురదమయంగా మారింది. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మట్టిరోడ్డు కావడతో గుంతలు పడి, వర్షపు నీరు చేరింది. అధికారులు రహదారికి మరమ్మతులు చేయాలని, సీసీ రోడ్డు నిర్మించి సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. **- తుగ్గలి**

బీజేపీ నాయకుల వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజరాజేశ్వరి ఆలయ ఆస్తులను కొందరు కబ్జా చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆందోళన చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆలయంలో మాట్లాడుతూ ఆలయ ఆస్తులు రూ.వంద కోట్లు ఉన్నాయని, సొమ్ముపై కొందరు కన్నేశారని సబ్‌కలెక్టర్, డీఎస్పీ కార్యాలయాల వద్ద ధర్నా చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఆలయ ఆస్తుల వివరాలు తెలుసుకోకుండా ఇలా చేయడం ఏంటని, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా అని ప్రశ్నించారు. ఆలయానికి ట్రస్టు ఉందని వారిపై అబాండాలు వేసిన వాళ్లమవుతామ న్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విట్టా రమేష్, ఎగాటి ప్రతాప్, బసవన్నగౌడ్, రాచోటి సుబ్బయ్య, దేవిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలి

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

తొలగించిన 150 మంది దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరిం చాలని సీపీఎం నాయకులు నగేష్, రాజు డిమాండ్ చేశారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ ప్రభుత్వం సదరం సర్టిఫికేట్లలో తక్కువ పర్సంటేజీ ఇచ్చి తొలగించారన్నారు. విషయాన్ని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా సదరం క్యాంప్‌కు వెళ్లి సర్టిఫికేట్లు తీసుకువస్తే పునరుద్ధరిస్తామనడం ఎంత వరకు సమంజసమన్నారు. మల్లి, సుదాకర్ ఉన్నారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి



గుంతలు పడిన పల్లెదొడ్డి రహదారిని చూపుతున్న నాయకులు

దేవనకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేయాలని బీజేపీ కార్యవర్గ సభ్యుడు జంగం వీరయ్య, జనసేన నాయకులు ఉచ్చీరప్పలు ఆర్‌అండ్ బీ డిమాండ్ చేశారు. బుధవారం పల్లె దొడ్డి, కర్నూలు-బళ్లారి రహదారులపై నిరసన తెలిపారు. గుంతలు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని వాటిని వెంటనే పూడ్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లెదొడ్డి రాముడు, ఉసేని, జనసేన ఈశ్వర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి కృషి

ఆలూరు రూరల్, ఆగస్టు 20 (ఆంధ్ర జ్యోతి): సంచార జాతుల అభివృద్ధికి పీఎం మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్, శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న సంచార జాతుల దినోత్సవం కరపత్రాలను విడుదల చేశారు.

పింఛన్లు తొలగించడం అన్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమని ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని, కొత్త పింఛన్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు తొలగించడం సరైన నిర్ణయం కాదన్నారు. ఏ పనీ చేసుకోలేని దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లను తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎంపీటీసీ దేవరాజు, బాషా, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, భాస్కర్, వీరేష్ పాల్గొన్నారు.

దుకాణం దగ్ధమై నష్టపోయిన టైలర్ రామకృష్ణను ఆదుకోవాలని ఎమ్మెల్యే విరుపాక్షిని టైలర్ అసోసియేషన్ నాయకులు మహమ్మద్‌రఫీ కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

రాజీవ్ గాంధీ జయంతి

ఆదోని టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 81వ జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నిర్వహించారు. చిన్న వయస్సులోనే దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టారన్నారు.

రైతులు పంటలను కాపాడుకోవాలి

• కేవీకే సమన్వయకర్త రాఘవేంద్ర



సూచనలు చేస్తున్న కేవీకే సమన్వయకర్త రాఘవేంద్ర చౌదరి

మద్దికెర ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పది రోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పంటలను కాపాడాకోవాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త కే.రాఘవేంద్ర చౌదరి సూచించారు. బుధవారం మద్దికెర, బురుజుల గ్రామాల్లో పొలం పిలుస్తుందిలో భాగంగా వర్షాలకు దెబ్బతిన్న పంటలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కంది లో అధిక తేమను తట్టుకోవడానికి 500 ఎంఎల్ నానో డీఏపీ, 500 ఎంఎల్ నానో యూరియా పిచికారీ చేయాలన్నారు. అదే విదంగా 500 గ్రాముల సీవోసీని మొక్కల వేర్లు తడిసేలా పిచికారీ చేసుకోవాలన్నారు. ఆముదం పంటలో కాయకుళ్లు తెగులు నివారణకు ఎంట్రాకల్ 500 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలని, పత్తిలో రసం పీల్చు పురుగుల నివారణకు ఫ్రిపోనిల్, ఇమిదా చెల్లోఫ్రిడ్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొలాల్లోని నీటినకి బయటకు పంపాలన్నారు. ఇష్టానుసారంగా మందులు పిచికారీ చేయకుండా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఏ వీటీసీ సమన్వయకర్త సుజాత, ఏవో యు.రవి, ఏఈవో బోజరాజు, వీఏఏ ఆనంద్, వంశీ, ఎంపీఈవో హేమసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వెల్దుర్తి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తమ పింఛన్‌ను తొలగించడం అన్యాయమని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో సుహాసినమ్మకు అర్జీలు అందజేశారు. అనర్హులను తీసివేయాలనే నెపంతో నిజమైన అంగవైకల్యం కలిగిన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిం చారు. తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

సారా మానండి.. ఉపాధి ఎంచుకోండి

పత్తికొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ మాని, ప్రభుత్వం అందించే స్వయం ఉపాధిని ఎంచుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు సూచించారు. నవోదయం-2లో బాగంగా బుధవారం ఎక్సైజ్ సీఐ సువర్ణలతతో కలసి మండలంలోని జెఎం తండా, పిఎం తండాలో గిరిజనులతో మాట్లాడారు. సారా నివారణకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. సారా తయారీ ప్రాణాంతకమని, చట్టపరంగా నేరమని గుర్తించాలన్నారు. సారా తయారుచేసినా, అమ్మినా జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు. సర్పంచులు రెహమాన్, లక్ష్మీనాయక్, ఎస్టీసెల్‌నాయకుడు సోమ్లానాయక్ ఉన్నారు.

పత్తికొండలో కార్డన్ సెర్చ్

• 11 బైకులు, ఆటో స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

పత్తికొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ జయన్న తెలిపిన మేరకు నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, 50 మంది పోలీసులతో కలిసి తనిఖీలు చేసి, పత్రాలు లేని 11 బైకులు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, మట్కా నిర్వాహకులు అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో తనిఖీ చేశామని, కౌన్సెలింగ్ ఇచ్చి, హెచ్చరికలు జారీచేశామని సీఐ తెలిపారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

హొళగుంద, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో ఆనంద్ లోకదాల్, తహసీల్దార్ నిజాముద్దీన్ హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఎరువుల దుకాణాలలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, గోదాములను పరిశీలించారు. సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

రహదారులకు మరమ్మతులు చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారులకు మరమ్మతులు చేయాలని సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్, చక్రాళ్ల రోడ్డు, గ్రామాల రహదారులు పాడ య్యాయని, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం లేకుండా పోయిందని ఆరోపించారు. రవిచంద్ర, రామాంజనేయులు, చంద్రకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమలను నిర్మూలిద్దాం



పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఈవో, సిబ్బంది

పత్తికొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): దోమలను నిర్మూలనకు కృషి చేయాలని పంచాయతీ ఈవో నరసింహులు పిలుపు నిచ్చారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి నాలుగు స్థంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలను విధిగా వాడాలన్నారు. సూపర్‌వైజర్లు సాయిబాబా, ప్రకాష్, గంగా, రత్నమ్మ, వరలక్ష్మి, రమేష్ ఉన్నారు

జాగ్రత్తలతో పత్తిని కాపాడుకోవచ్చు



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

దేవనకొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రైతులు జాగ్రత్తలు తీసుకుంటే పత్తి పంటను కాపాడుకోవచ్చని కర్నూలు ఏరువాక కేంద్రం సీనియర్ సైంటిస్ట్ సుజాతమ్మ సచించారు. బుధవారం దేవనకొండలో పత్తి పంటను పరిశీలించారు. ముంపుకు గురైన బరువు నేలల్లో నానో యూరియా 2.5 ఎం.ఎల్./ లీటర్ నీటికి (500 ఎం.ఎ/ ఎకరా) కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే పత్తి పూత పిందె రాలకుండా ప్లనోఫిక్స్ 1 ఎం.ఎల్./ 5 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. శాస్త్రవేత్త కె.మోహన్, ప్రోగాం కో ఆర్డినేటర్ రాఘవేంద్రచౌదరి, ఏవో ఉషారాణి, ఏఈవో మల్లికార్జున, వీఏఏ కళావతిబాయ్ ఉన్నారు.

ఉద్యోగులకు సీపీఐ నాయకుల వినతి



కార్యదర్శికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మద్దికెర ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పించన్లు తొలగించడం అన్యాయమని మండల సీపీఐ నాయకులు నాగరాజు, హనుమన్న అన్నారు. బుధవారం బసినేపల్లి గ్రామంలో సచివాలయ కార్యదర్శి పరమేశ్వరప్పకు వినతి పత్రం అందజేశారు. మండలంలో 63 పింఛన్లు తొలగించారనీ, అర్హులైన వారి పేర్లు కూడా ఉన్నాయన్నారు. కొత్త పించన్లు ఇవ్వకుండా ఉన్నవి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

టమోటా రైతును ఆదుకోవాలి



టమోటాను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆస్పరి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలకు దెబ్బతిన టమోటా రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌసదేశాయ్, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం పుటకలమర్రి, వలగొండ, కైరుప్పల గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. బాలకృష్ణ, పురుషోత్తం, నాగరాజు, భాస్కర్, అంజనేయ ఉన్నారు.

యూరియా పంపిణీ

కోసిగి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):కోసిగి మండలంలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా 700 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే పంపిణీ చేసినట్లు, అలాగే ఎరువుల దుకాణాల ద్వారా వేయి మెట్రిక్ టన్నులు మొత్తం 1700 మెట్రిక్ టన్నుల యూరియాను కోసిగి మండల రైతులకు పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. నానో యూరియా వినియోగం వలన రైతులు మంచి పంట దిగుబడులు సాధించవచ్చన్నారు.

డీసీఎంఎస్ తనిఖీ

ఎమ్మిగనూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయాన్ని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి మంజూరైన యురియా వివరాలను, రైతులకు పంపిణీ చేసిన వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సబ్ కలెక్టర్ వెంట ఏడీఏ మహ్మద్ ఖాద్రీ, ఏఓ శివశంకర్, ఏఈఓలు నరసింహం, వినోద్ కుమార్, డీసీఎంఎస్ మేనేజర్ సత్యనారాయణ ఉన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి బి. గోవర్ధనమ్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోవిందు, రాముడు, నాగలక్ష్మీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు విక్రయిస్తే సీజ్ చేస్తాం: ఏడీఏ

మంత్రాలయం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువులు, పురుగు మందులు అధిక రేట్లకు విక్రయిస్తే సంబంధిత దుకాణాలను సీజ్ చేస్తామని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, తాహశీల్దార్ రమాదేవిలు అన్నారు. బుధవారం మండలంలోని మాధవరంలో బాలాజీ ఎంటర్ ప్రైజస్ దుకాణంను ఏడీఏ మహమ్మద్ ఖాద్రి అకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో అక్రమంగా నిల్వ ఉంచిన 420 వివిధ రకాల ఎరువు బస్తాలను జప్తు చేశారు. తనిఖీలో ఏఈఓ తిరుమల రెడ్డి, వీహెచ్ఏలు రాజేష్, విజయ్, సురేంద్రలు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి

కోసిగి ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సెంటర్లలో నమోదు చేసుకున్న గర్భిణులందరికీ నెల నెలా తప్పనిసరిగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో ఎస్.రాజేశ్వరి, డా.రాజ్‌కిరీటీ అన్నారు. మండల కేంద్రమైన కోసిగిలోని 8, 15 అంగన్‌వాడీ సెంటర్లలో గర్భవతులకు సీమంతాలు చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కాత్యాయనీ, భాగ్యలక్ష్మిబాయి, అంగన్‌వాడీ టీచర్లు, లూసమ్మ, వరలక్ష్మి, నాగవేణి, నాగలక్ష్మి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

బనవాసి ఫారం ఆక్రమణదారులపై చర్యలు

ఎమ్మిగనూరు,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి ఫారం (బనవాసి జెర్సీ పశువుల క్షేత్రం) భూములను అక్రమంగా సాగుచేసుకుంటున్న వారిపై ఎట్టకేలకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఇటీవల అధికారులు భూములను కొంత మేర సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. తాజాగా బుదవారం అక్రమంగా సాగుచేసుకుంటున్న భూములపై చర్యలు చేపట్టారు. పశుక్షేత్రం పరిధిలోని వన్నంబాయి సమీపంలో ఉన్న భూములను సమీప గ్రామాలకు చెందిన కొంత మంది ఎలాంటి అనుమతులు లేకుండాకొంతకాలంగా సాగుచేసుకుంటు వస్తున్నారు. ఈ భుములను వదిలిపెట్టాలని క్షేత్రం సిబ్బంది ట్రాక్టర్ తీసుకెళ్లి పోలాలను కొంత మేర దున్నేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే అధికారులు ఆదేశాలతో చర్యలు చేపట్టామని ఏదైనా ఉంటే అధికారుల దగ్గరకు వెళ్లాలని సూచించారు. దీంతో వారు వైసీపీ పార్టీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి ద్వారా స్థానిక డీడీని కలిసి కొంత సమయం ఇవ్వాలని కోరటంతో రెండు రోజులు సమయం ఇచ్చినట్లు తెలిసింది.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

నందవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లోని మందులను బుధవారం తహసీల్దారు శ్రీనివాసులు, వ్యవసాయ అధికారిని సరిత అకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులు అమ్మితే దుకాణం సీజ్ చేస్తామని హెచ్చరించారు. వీరితో పాటు డిప్యూటీ తహసీల్దారు మహేష్ పాల్గొన్నారు.

కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి

- అధిక వర్షాలతో దెబ్బతిన్న ఉల్లి పంట
- తెలంగాణ మార్కెట్‌లో కూడా గిట్టుబాటు ధర లేదు
- వీధుల్లో తిరుగుతూ ఉల్లి అమ్ముకుంటున్న రైతన్నలు



తడిసి పోవడంతో పొలంలో వదిలివేసిన ఉల్లి పంట



గోనెగండ్లలో మార్కెట్ బయట ఉంచిన ఉల్లి పంట



ఎమ్మిగనూరులో తడికి కుళ్లిపోకుండా ఉల్లిగడ్డలను తిప్పేస్తున్న దృశ్యం

రైతే రాజు.. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. ఇలాంటి మాటలు రాజకీయ నాయకులు ఉపన్యాసాలు ఇవ్వడానికి బావుంటాయి.. నిజంగా రైతు పడే కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందా..? అంటే అలా.. అడగడం కూడా నేరమే.. ఈ రోజుల్లో... రైతు రాజు కాదు కాదా! కనీసం బంటు కూడా కాదు. వీధుల్లో తిరుగుతూ తన పంటను అమ్ముకునే దుస్థితికి రైతు వచ్చాడు అంటే చాలా బాధాకరమైన పరిస్థితి ఇది..

ఎమ్మిగనూరు/ గోనెగండ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పది రోజులుగా కురుస్తున్న వర్షాలు, ముసురు, కారణంగా ఉల్లి పంట కోలుకోలేని దెబ్బతింది. వర్షానికి ఉల్లిగడ్డ తడిసిపోయి కుళ్లిపోతుండటంతో ఉల్లి కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 10,797 హెక్టార్ల పంటను సాగు చేశారు. అలాగే ఎమ్మిగనూరు డివిజన్‌లో 4వేల హెక్టార్లు సాగు చేశారు. చేతికి అందే సమయానికి వర్షం రోజూ పడుతుండటంతో ఉల్లి పంటకు మజ్జిగ తెగులు సోకింది. పంట అదును కొచ్చిందని కొస్తే వర్షానికి తడవడంతో ధర పలకడం లేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. కర్నూలు మార్కెట్‌లో క్వింటం ధర రూ. 600 నుంచి రూ. 1100 లకు ధర మించి పలకడం లేదు, గత కొన్ని రోజులుగా కురిసిన అధిక వర్షాల కారణంగా ఉల్లి పంటకు మజ్జిగతెగులు సోకడంతో గడ్డ ఊరక పోగా చిన్నసైజ్ గా ఉండటంతో ధర పలకడం లేదని వ్యాపారులు, రైతులు ఆవేదన చెందుతున్నారు. అయితే తెలంగాణాలో అయినా ధర పలుకుందేమోనని గోనెగండ్ల కు చెందిన కొందరు ఉల్లి రైతులు హైదరాబాద్ మార్కెట్‌కు వెళ్లి అమ్మకాలు జరిపి వచ్చారు. అక్కడ కూడా క్వింటం ధర రూ. 1000 మించి పలకక పోవడంతో ఇక చేసేది లేక ఆటోల్లో వేసుకొని గ్రామాల్లోని వీధుల్లో తిరుతూ అమ్మకాలు జరుపుతున్నారు. మార్కెట్ కు పోతే కనీస ధర కూడా పలకక పోవడంతో పాటు రవాణా ఖర్చులకు కూడా రావని .. చేసేది లేక రైతులు పొలాల దగ్గరనే వ్యాపారులకు క్వింటం ధర రూ. 600 నుంచి రూ. 1000 లోపు విక్రయిస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఆటోలలో ఉల్లి బస్తాలను వేసుకొని వీధుల్లో తిరుగుతూ రూ. 100 కు ఐదు కేజీల ప్రకారం అమ్మకాలు జరుపుతున్నారు. 50 కేజీ బస్తా రూ. 500 నుంచి రూ. 600 అమ్ముతున్నారు. ఈ ఏడాది దిగుబడి కూడా సగానికి పడిపోయింది ఎకరంలో 300 బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా 150 బస్తాలకు మించి దిగుబడి రాలేదని రైతులు తెలుపుతున్నారు. కష్టపడి పండించిన పంటను వీధుల్లో తిరుగుతూ కేజి ప్రకారం అమ్మలు జరుపుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. గోనెగండ్ల మండలంలో దాదాపు 2000 ఎకరాల్లో ఉల్లిని సాగు చేశారు. ఎకరానికి పెట్టుబడి దాదాపు రూ.80వేల నుంచి రూ. 90వేల వరకు వస్తుందని రైతులు తెలుపుతున్నారు.

ఎమ్మిగనూరు మండలంలోని ఎర్రకోట, రాళ్లదొడ్డి, కలుగొట్ల, గోనేగండ్ల, హెచ్ కైరవాడితో పాటు ఆయా గ్రామాల్లో రైతులు రైతులు ఉల్లిపంటను సాగుచేశారు. ఎకరాకు దాదాపు రూ. 75వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. పంట చేతికి రావటంతో రైతులు అక్కడ అక్కడ పంటను పీకి కోతకు సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో పదిరోజులుగా వర్షం ఎకదాటిగా కురువటంతో కోతకు సిద్ధం చేసిన ఉల్లిపంట పొలాల్లోనే తడిసి ముద్దయ్యింది. దీంతో కోత కోసుకునే అవకాశం లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పదిరోజులకు పైగా పొలాల్లోనే ఉండటంతో ఉల్లి గడ్డ కుళ్లిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అసలే ధరలు లేక అల్లాడుతున్న ఉల్లిరైతుపై వరుణుడు తన ప్రతాపం చూపటంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఎకరాకు దాదపు 90 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 40నుంచి 50 క్వింటాళ్లకు మించి రావటం గగనంగా మారింది. అంతేగాక మార్కెట్‌లో ధరలు ఉల్లి క్వింటాలు రూ. 600 నుంచి రూ 800కు మించి అడగటం లేదు. దీంతో ఉల్లిరైతు భారీగా నష్టాన్ని మూటకట్టుకోవాల్సి వస్తోంది. బుధవారం వర్షం పడకపోవటం ఉల్లిరైతులకు కొంత ఊరటనివ్వటంతో పొలాల్లో ఉన్న పంటను తిరగేసేకుంటూ ఆరబెట్టుకుంటున్నారు.

పది రోజులుగా పొలంలోనే ఉల్లి పంట



రెండు ఎకరాల్లో ఉల్లి పంటను సాగుచేశా. పంట చేతికి రావటంతో గత పదిరోజుల క్రితం ఉల్లిని పెరికి కోత కోసేందుకు అరబెట్టాం. అయితే వర్షం ఎకదాటిగా రావటంతో పోలం లోనే ఉండి పోయింది. పదిరోజులుగా వర్షానికి నానటంతో పంట భారీగా దెబ్బతింది. ప్రస్తుతం కోత కోసి అమ్మాలంటేనే భయమోస్తోంది. పెట్టుబడికూడా చేతికి అందే పరస్థితి కనిపించటం లేదు. ప్రభుత్వం ఉల్లిరైతును ఆదుకోవాలి.

● రామకృష్ణ, రైతు, ఎర్రకోట, ఎమ్మిగనూరు మండలం

పెట్టుబడి డబ్బులు కూడా రాలేదు



ఎకరం పొలంలో ఉల్లి పంటసాగు చేశాము. అధిక వర్షాలకు పంట దిగుబడి కూడా దెబ్బతింది. గడ్డ కూడా ఊరలేదు. ఎకరం పంటకు పెట్టుబడి కింద రూ. 80వేలు వచ్చింది. పెట్టిన పెట్టుబడి డబ్బులు కూడా చేతికి రాలేదు.

● బద్రి, ఉల్లి రైతు

దేవాలయానికి నీళ్ల ట్యాంకర్ విరాళం

కౌతాళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి భక్తులు శ్రావణ మాసంలో భాగంగా బుధవారం దేవాలయంలో స్వామి వారి భక్తులకు నీళ్ళ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బుధవారం తెలంగాణ రాష్ట్రం గద్వాల్‌కు చెందిన మంత్రాలయం జనరల్ స్టోర్ యాజమాన్యం నీళ్ళ ట్యాంకర్‌ను విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వాణి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దేవాలయంలో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు తాగునీటి ఎద్దడి లేకుండా నూతనంగా తయారు చేసిన నీళ్ళ ట్యాంకర్‌ను అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

మంత్రాలయం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి వద్ద బైక్ బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, మాధవరం పోలీసులు తెలిపిన వివరాలు.. పెద్దకడుబూరు మండలం దేవరబెట్ట గ్రామానికి చెందిన గొల్ల ఈరన్న, సూగూరు గ్రామానికి చెందిన మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మాధవరం నుంచి ఇద్దరు ఒకే మోటారు సైకిల్‌పై వెళ్తుండగా.. అదుపు తప్పి పక్కనే ఉన్న బురద గుంతలో పడింది. గాయాలతో పాటు శరీరమంతా బురదతో మునిగిపోయారు. అక్కడే ఉన్న గ్రామస్థులు 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని మాధవరం పోలీసులు తెలిపారు.

పట్టణంలో కార్డన్ సెర్చ్



సంజీవనగర్‌లో కార్డన్ సెర్చ్‌లో భాగంగా విచారిస్తున్న డీఎస్పీ భార్గవి, సీ ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో డీఎస్‌పీ భార్గవి అధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్డెన్ సెర్చ్‌లో సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు. పట్టణంలోని లక్ష్మీపేట, సంజీవనగర్, ఎంఎస్ నగర్, వెంకటాపురం కాలనీ, ఎస్సీ కాలనీ, క్రాంతినగర్, తిలక్‌నగర్, ఎరుకుల కాలనీ, శక్తి నగర్‌లలో కార్డెన్ సెర్చ్‌లో భాగంగా డీఎస్పీ భార్గవితో పాటు సీఐ శ్రీనివాసులు, మధుసూదన్ రావు, మంజునాథ్, విజయభాస్కర్, రామాంజులు, ఎస్సై మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, నిరంజన్ రెడ్డి, కేశవ, శివాంజల్, మల్లికార్జున, శరత్ మంగళవారం తెల్లవారుజామున వారు పేరు మోసిన రౌడీషీటర్‌ల ఇళ్లలో, అనుమానితుల ఇళ్లలో సెర్చ్ చేసి రికార్డులు లేని, పత్రాలు చూపని 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రౌడీషీటర్‌ల ఇళ్లలలో తనిఖీ చేసి వారందరిని విచారించగా కొంత మంది అందుబాటులో ఉండగా మరికొంత మంది పనులకు వేరే ఊరు వెళ్లారని స్థానికులు తెలిపారు. అందుబాటులో ఉన్న వారందరికి కౌన్సెలింగ్ ఇచ్చామని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ తెలిపారు. నెంబర్ ప్లేట్ లేనివి, సరైన పత్రాలు చూపని ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి పత్రాలు చూపించి వాటిని తీసుకెళ్లాలని లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రాఘవరాయలకు స్వర్ణ కవచ సమర్పణ సేవ



రాఘవరాయల బృందావనాన్ని అలంకరించిన దృశ్యం

మంత్రాలయం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా చేశారు. . బుధవారం శ్రావణ ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో తెల్లవారుజామునుంచే మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో టీజీ వెంకటేశ్



ఈరన్నస్వామిని దర్శించుకుంటున్న టీజీ వెంకటేశ్

కౌతాళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారిని బుధవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ముందుగా ఆలయ ఈఓ వాణి, ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి పూలమాల, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మతోట రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఆలయ అధికారి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు ఉన్నారు.

వైభవంగా శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ



దొడ్డిమేకలలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠలో హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పెద్దకడబూరు , ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలోని బుధవారం శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ వేడుక వైభవంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ రాంమూర్తి,సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన, మహాగణరాధన, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి విగ్రహాలను ఆలయ అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల భక్తి గీతాల మధ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు

గోనెగండ్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యజమానులు యూరియా కొరతను సృష్టించి రైతులకు అధిక ధరలకు అమ్మకాలు జరిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో హేమలత, డిప్యూటీ తహసీల్దార్ రఘువీర ఎరువుల దుకాణాదారులను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంద పాల్గొన్నారు.

'మరో ఐదు రోజులు వర్ష సూచనలు లేవు'

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఐదు రోజుల పాటు వర్షసూచనలు లేవని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ఆదివారం వరకు జిల్లాలో కేవలం 05.మీమీ వర్షపాతం మాత్రమే ఉందన్నారు. ఈ సమయంలో రైతులు పొలాల్లో అధికంగా నిలిచిన నీటిని బయటకు పంపి పంటలను రక్షించుకోవాలని సూచించారు.

పింఛన్లను పునరుద్ధరించాలి



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు



కోసిగిలో ధర్నా చేస్తున్న నాయకులు, దివ్యాంగులు

కౌతాళం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల పించన్లను అకారణంగా తొలగించిన ఫించన్లను వెంటనే పునరుద్దరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వికలాంగుల నిరసనకు ఆయన మద్దతు తెలిపారు.

గోనెగండ్ల: ప్రభుత్వం ఇటీవల తొలగించిన దివ్యాంగుల పింఛన్‌లను పునరుద్ధరించాలని కోరుతూ మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట దివ్యాంగులు అరగంట పాటు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాధాలు చేశారు. సందర్భంగా అనంతశయన మాట్లాడుతూ సంబంధిత సచివాలయాలలో ఈకేవైసీ చేయించుకొని దృవపత్రాలను ఎంపీడీవో కార్యాలయం లో ఇవ్వాలని వాటిని ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు సోమన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు నాగశేషమ్మ పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్ల తనిఖీలో వివిధ కారణాలతో తొలగించిన పింఛన్లను పునరుద్ధరించి న్యాయం చేయాలని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఎంపీడీవో నూర్జహాన్‌కు వినతి పత్రం అందజేశారు. సదరం సర్టిఫికెట్ల ఆధారంగానే అనర్హులైన వారిని తొలగిస్తున్నారని ఆధారాలు ఉన్న వారికి పింఛన్లు అందిస్తారన్నారు.

కోసిగి: కోసిగి ఎంపీడీవో కార్యాలయానికి తాళం వేసి దివ్యాంగులతో కలిసి ఏఐవైఎఫ్ నాయకులు తొలగించిన పింఛన్లు పురుద్ధరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజు, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఎమ్మార్పీఎస్ నాయకులు దుర్గప్ప ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయం ముందు దివ్యాంగులతో కలిసి మద్దతుగా ధర్నా చేశారు. కార్యక్రమంలో తాయన్న,రాజేష్, నాయకులు మహేష్‌బాబు, ప్రతాప్, హనుమంతు పాల్గొన్నారు.